# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

# కరీంనగర్

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి

మంగళవారం 06 అక్టోబర్ 2026




## గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- ధర్మపురి, కోటిలింగాల పుష్కర ఘాట్ల వద్ద మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



వివరాలు 17లో..

## పరిమితికి మించి విద్యార్థుల తరలింపు..

- స్కూల్ బస్సుల్లో భద్రత ప్రశ్నార్థకం




3లో

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- జగిత్యాలలో ప్రముఖ రెస్టారెంట్లపై మున్సిపల్ అధికారుల దాడి
- పీఎంఆర్, కింగ్స్ మండి రెస్టారెంట్లలో కుళ్లిపోయిన ఆహారం గుర్తింపు:



17లో

# ప్రశ్నిస్తే... దండిస్తా...?

### ఫిర్యాదు చేసిన వ్యక్తి పనిచేస్తున్న ఆస్పత్రికే తాళం...!

- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే... ఫిర్యాదుదారుడిపైనే ఆగ్రహం!
- 'నువ్వెవరు..?' 'ఏ అధికారంతో ప్రశ్నిస్తున్నావు..?' అంటూ కమిషనర్ మండిపాటు
- పట్టణంలో హాట్‌టాపిక్!

5లో





# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. ప్రజాసేవే పరమావధి

- కార్యకర్తగా ప్రారంభమైన ప్రస్థానం..
- కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎదుగుదల..
- 19వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజాసేవ
- అక్టోబర్ 7న ఘనంగా ప్రమాణ స్వీకారం..
- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై నమ్మకంతో, పార్టీ బలోపేతమే ధ్యేయంగా, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎం.ఏ. నయీమ్ రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలోనూ పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన నయీమ్.. అంచెలంచెలుగా ఎదుగుతూ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా, 19వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. తాజాగా ఆయనకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా కీలక బాధ్యతలు అప్పగించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వివరాలు 2లో..

# రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

- 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- విస్తరణ పనులు పూర్తి చేసే అవకాశం అదృష్టం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్




8లో

"కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై నమ్మకంతో, పార్టీ బలోపేతమే ధ్యేయంగా, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎం.ఏ. నయీమ్ రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలోనూ పార్టీకి అండగా నిలిచి, కార్యకర్తగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన నయీమ్.. అంచెలంచెలుగా ఎదుగుతూ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా, 19వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. తాజాగా ఆయనకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా కీలక బాధ్యతలు అప్పగించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నయీమ్ ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా మైనార్టీ వర్గాలను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేయడం, యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది."

## మైనార్టీ యువతకు అండగా నిలవాలనే లక్ష్యం



జిల్లాలోని మైనార్టీ యువతకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయనున్నాయి. పార్టీ నాయకుడు నయీమ్ నేతృత్వంలో యువతను రాజకీయాల్లో చురుకుగా భాగస్వాములను చేయడం, గ్రామీణ స్థాయి నుంచి మైనార్టీ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడం మరియు ప్రతి మండలంలో కార్యకర్తలతో సమన్వయం పెంచడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

కోరుట్ల, అక్టోబర్ 05, ప్రజాజ్యోతి

## అక్టోబర్ 7న ప్రమాణ స్వీకారం

జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించనున్న ఎం.ఏ. నయీమ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అక్టోబర్ 7వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కోరుట్లలోని జీఎస్ గార్డెన్‌లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నయీమ్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరుకానున్నారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. ప్రజాసేవే పరమావధి

**జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా ఎం.ఏ. నయీమ్**

- కార్యకర్తగా ప్రారంభమైన ప్రస్థానం..
- కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎదుగుదల..
- 19వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజాసేవ
- అక్టోబర్ 7న ఘనంగా ప్రమాణ స్వీకారం..
- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం



## కష్టకాలంలోనూ కాంగ్రెస్‌ను వీడని నయీమ్

కాంగ్రెస్ పార్టీకి కష్టకాలం వచ్చినప్పుడు కూడా ఎం.ఏ. నయీమ్ పదవుల కంటే పార్టీ పట్లే నిబద్ధతతో వ్యవహరించారు. అధికారంలో లేనప్పటికీ నిరంతరం ప్రజల్లో ఉంటూ, నాయకులు మరియు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశారు. స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తూ ప్రజా సమస్యలపై పోరాడడం ద్వారా ఆయన కాంగ్రెస్ శ్రేణుల్లో మరియు ప్రజల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించారు.

## కోరుట్ల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కీలక పాత్ర

కాంగ్రెస్ పార్టీలో ఎం.ఏ. నయీమ్ సేవలను గుర్తించి ఆయనకు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. ఈ పదవిలో ఆయన పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడం, కార్యకర్తలను సమన్వయం చేయడం మరియు ప్రజా సమస్యలపై బలంగా స్పందించడంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ విధానాలను, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ ఆయన పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించారు.

## 19వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజల మధ్యే..

కాంగ్రెస్ నాయకుడు ఎం.ఏ. నయీమ్ ప్రజాప్రతినిధిగా కోరుట్ల మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్‌గా సేవలు అందించారు. ఆ సమయంలో ఆయన ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల



సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ వార్డు అభివృద్ధికి శ్రమించి, స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకున్నారు.

## జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్‌గా కొత్త బాధ్యత

నయీమ్ సేవలకు గుర్తింపుగా ఆయనకు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదవి ద్వారా జిల్లా వ్యాప్తంగా మైనార్టీలను సమన్వయం చేస్తూ పార్టీని బలోపేతం చేసే కీలక బాధ్యత ఆయనపై పడింది. మైనార్టీ వర్గాల సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, యువతను పార్టీతో అనుసంధానిస్తూ కాంగ్రెస్‌లో మైనార్టీల భాగస్వామ్యాన్ని పెంచడంపై ఆయన ప్రధానంగా దృష్టి సారించనున్నారు.

## ప్రమాణ స్వీకారానికి ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, డా. ఎం. సంజయ్ కుమార్, జువ్వాడి నర్సింగ్ రావు, బొమ్మ శ్రీరామ్, మహమ్మద్ ఇర్ఫాన్ అలీ, మనాల మోహన్ రెడ్డి, తిరుమల వసంత గంగాధర్, మైలారపు లింబాద్రి, గజ్జెంగి నందయ్య, జువ్వాడి కృష్ణారావు, ఉమాదేవి తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు. దీంతో ఎం.ఏ. నయీమ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## జిల్లాలో కాంగ్రెస్‌కు కొత్త ఊపు తీసుకురావడమే లక్ష్యం

జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్‌గా తనకు లభించిన అవకాశాన్ని పార్టీ బలోపేతానికి వినియోగించుకోవాలనే లక్ష్యంతో నయీమ్ ముందుకు సాగుతున్నారు. కేవలం పదవికే పరిమితం కాకుండా కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ముఖ్యంగా గ్రామస్థాయి కార్యకర్తలతో నేరుగా సంబంధాలు పెంచుకుంటూ, ప్రతి గ్రామంలో మైనార్టీల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఆయన ప్రధాన ధ్యేయం.

## కార్యకర్త నుంచి జిల్లా నాయకత్వం వరకు..

కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం కోరుట్ల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గతంలో 19వ వార్డు కౌన్సిలర్ జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ విభాగం చైర్మన్ అంటూ ఎం.ఏ. నయీమ్ రాజకీయ ప్రస్థానం అంచెలంచెలుగా కొనసాగుతోంది. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహం నెలకొంటోందని పలువురు నాయకులు పేర్కొంటున్నారు. నయీమ్‌కు



లభించిన జిల్లా స్థాయి బాధ్యత కూడా ఇదే కోవలోకి వస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

## పదవి బాధ్యత.. గౌరవం కాదు.. సేవకు అవకాశం

జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్ పదవిని కేవలం హోదాగా కాకుండా ప్రజలు, కార్యకర్తలకు సేవ చేసే బాధ్యతగా ఎం.ఏ. నయీమ్ భావిస్తున్నారు. కార్యకర్తగా, కౌన్సిలర్‌గా, పట్టణ ఉపాధ్యక్షుడిగా ఆయనకున్న అనుభవం ఈ జిల్లా స్థాయి బాధ్యతల్లో ఎంతో ఉపయోగపడనుంది. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు.

## కాంగ్రెస్ బలోపేతమే నా లక్ష్యం.. ప్రజాసేవే నా బాధ్యత

జిల్లా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్‌గా కొత్త బాధ్యతలు స్వీకరించనున్న ఎం.ఏ. నయీమ్ రానున్న రోజుల్లో జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూర్చేలా పనిచేస్తారా? మైనార్టీ వర్గాలను పార్టీకి మరింత చేరువ చేయడంలో ఎంతవరకు విజయవంతమవుతారో వేచి చూడాలి.

ప్రజాజ్యోతి
మంగళవారం 06 అక్టోబర్ 2026



## కబడ్డీ స్టేట్ మీట్‌కు కేజీబీవీ విద్యార్థినులు ఎంపిక

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) చెందిన ఐదుగురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ స్టేట్ మీట్ పోటీలలో వీరు పాల్గొంటున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను జిల్లా జెసిడిఓ పద్మజ, కేజీబీవీ ఎస్ఓ అజంతా, పిఈటి శ్రీలతతో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలలో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## 53వ సారి రక్తదానం

### గిరిధర్ రెడ్డి అంకితభావం అభినందనీయం

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నాయకులు వంగ గిరిధర్ రెడ్డి గాంధీ జయంతిని పురస్కరించుకుని 53వ సారి రక్తదానం చేశారు. 2001లో గాంధీ జయంతి రోజున 'సహాయ' స్వచ్ఛంద సంస్థను స్థాపించి, విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్తదాన శిబిరంలో ఆయన మరొకసారి రక్తదానం చేశారు. పావు శతాబ్ద కాలంగా నిరంతరాయంగా సమాజ సేవలో భాగస్వామ్యమవుతూ, క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్న గిరిధర్ రెడ్డిని గ్రామస్తులు, పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు. సమాజం పట్ల ఆయనకున్న అంకితభావం, సేవా నిరతి ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు.




# కాంగ్రెస్‌లోకి పెద్దకల్వల ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

**పెద్దపల్లి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ లక్ష్మితో పాటు పలువురు వార్డు సభ్యులు, వారి అనుచరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వారిని పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ.. గ్రామంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో నూతనంగా చేరిన నాయకులు శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ



సర్పంచ్ కారంగుల రమేష్, మాజీ ఉపసర్పంచ్ ఆర్కుటి సంతోష్, వార్డు సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆదర్శాలు అనుసరణీయం

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టరేట్‌లో ఘనంగా గడ్డం వెంకటస్వామి (కాక) జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్, అదనపు కలెక్టర్



**పెద్దపల్లి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** మారుమూల ప్రాంతంలో జన్మించి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగిన గడ్డం వెంకటస్వామి (కాక) జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన చూపిన బాటను ఆదర్శంగా తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జి.వెంకటస్వామి జయంతి వేడుకల్లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతలు చేపట్టి పేదల అభ్యున్నతికి, తెలంగాణ కోసం నిరంతరం తపించిన మహనీయుడు వెంకటస్వామి అని కొనియాడారు. ప్రభుత్వ భూములను పేదలకు అందించడంలో, కోల్ బెల్ట్ ప్రాంతంలో కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అధికారులు, సిబ్బంది ఆయన స్ఫూర్తితో పనిచేస్తూ అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ప్రకాష్, సీపీవో రవీందర్, ఇంటర్మీడియట్ అధికారిణి కల్పన, క్రీడాధికారి సురేష్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ ముక్క శంకర్ కుటుంబ సభ్యులను సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. నాలుగు రోజుల క్రితం మాజీ సర్పంచ్ ముక్క శంకర్ భార్య, రాజన్నపేట వార్డు సభ్యురాలు ముక్క మౌనిక అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, గ్రామానికి ఆమె అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. శంకర్ కుటుంబాన్ని



ఓదార్చి తమ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాజన్నపేట సర్పంచ్ గోగూరి బాపురెడ్డి, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, గుండాటి రామ్ రెడ్డి, నంది కిషన్, మెండే శ్రీనివాస్, వంగ శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్య

## ఎమ్మెల్యే విజయరమణ రావు

- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్



**ఎలిగేడు, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ.200 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్" నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతి, భవనాల నాణ్యతను అడిగి తెలుసుకుంటూ, నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో సుమారు 2,560 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించడంతో పాటు హాస్టల్, ప్లేగ్రౌండ్, డైనింగ్ హాల్ వంటి ఆధునిక వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో గడిచిన రెండున్నరేళ్లలోనే పాఠశాలల మౌలిక వసతుల కోసం రూ.70 కోట్లు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత అల్పాహారం, పాలు, రాగిజావ మరియు మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్యాల రమేష్, సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకా వెంకటస్వామి జయంతి వేడుకలు

## నివాళులర్పించిన విప్ విజయరమణ రావు

- సుల్తానాబాద్‌లో కాకా విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఎమ్మెల్యే
- బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాకా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడవు



**సుల్తానాబాద్, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** మాజీ కేంద్రమంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ ముద్దుబిడ్డ స్వర్గీయ కాకా గడ్డం వెంకటస్వామి 97వ జయంతి వేడుకలను సుల్తానాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఉన్న కాకా వెంకటస్వామి విగ్రహానికి ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం కాకా వెంకటస్వామి చేసిన నిరంతర సేవలను ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్ టి. రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాకా అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమంగా పశువుల తరలింపు: వాహనం పట్టివేత

### 31 పశువులను గోశాలకు తరలించిన మంథని పోలీసులు

**మంథని, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని భట్టుపల్లి రోడ్డుపై సోమవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహించిన పోలీసులు, అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తున్న డీసీఎం వ్యాన్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎన్. సందీప్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి నుంచి మంథని వైపు వెళ్తున్న వాహనాన్ని (టా టి ఎస్ 12 యు డీ 4009) తనిఖీ చేయగా, ఎలాంటి పత్రాలు లేకుండా కసాయిఖానాకు తరలిస్తున్న 22 ఆవులు, 9 ఎడ్లు (మొత్తం 31 పశువులు) లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకుని భట్టుపల్లిలోని కపిల గోశాలకు తరలించారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న సిద్దిపేటకు చెందిన మహమ్మద్ సద్దాం, కరీంనగర్‌కు చెందిన మహమ్మద్ రిజ్వాన్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, బోర్లగూడెం, రెడ్డిపల్లి ప్రాంతాల నుంచి వీటిని సేకరించి హైదరాబాద్‌లోని స్లాటర్‌హౌస్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. గోశాలకు తరలించిన పశువుల సంరక్షణను సర్పంచ్ భూగౌండ రవి, నిర్వహకులు గొట్టం రాజు, సమ్మన్న, తిరుపతి పర్యవేక్షిస్తున్నారు. పశువులను సురక్షితంగా కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

## పేదోడికి అండగా కొలిపాక శ్రీనన్న

### డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

**పెద్దపల్లి, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** పెద్దపల్లి పట్టణం తెనుగువాడకు చెందిన కలెవెన కోటేశ్ డయాలసిస్ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న కొలిపాక శ్రీనన్న మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సాయం అందించారు. కోటేశ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి, వైద్య ఖర్చుల వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన తన వంతుగా సాయం చేశారు. కష్టసమయంలో పేద కుటుంబానికి అండగా నిలిచిన కొలిపాక శ్రీనన్నను స్థానికులు అభినందించారు.



# ప్రశ్నిస్తే... దండిస్తా...?

## ఫిర్యాదు చేసిన వ్యక్తి పనిచేస్తున్న ఆస్పత్రికే తాళం...!






**హుజురాబాద్, అక్టోబర్ 05, ప్రజా జ్యోతి :**
ప్రజా సమస్యపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి... ప్రశ్నించిన వ్యక్తినే టార్గెట్ చేస్తారా.. ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారుడిపైనే చర్యలా.. హుజురాబాద్ మున్సిపల్ అధికారుల తీరుపై ఇప్పుడు ఇవే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని మామిండ్లవాడలో సెట్‌బ్యాక్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందంటూ అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్ నవాబ్ పాషా మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినట్లు సమాచారం. ఇదే అంశంపై గతంలోనూ ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెబుతున్నాడు. అయితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన సమయంలోనే అసలు వివాదం మొదలైనట్లు తెలుస్తోంది.

### ‘నువ్వెవరు.. నీకేం అవసరం..

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన నవాబ్ పాషాపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఆయన ఆరోపిస్తున్నాడు. ‘నువ్వెవరు..ఏ అధికారంతో ప్రశ్నిస్తున్నావు.. నీకేం అవసరం.. అంటూ ప్రశ్నించినట్లు చెబుతున్నాడు. ఫిర్యాదు చేసేందుకు తీసుకొచ్చిన పత్రాన్ని సైతం నేలపై పడేసి, కార్యాలయంలో ఇచ్చి వెళ్లాలని చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజా సమస్యను ప్రశ్నించేందుకు ప్రత్యేక అధికారం కావాలా.. లేక ప్రజా సమస్యపై ఫిర్యాదు చేసే హక్కు ప్రతి పౌరుడికీ ఉందా.. అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.

### ఫిర్యాదు అక్కడ... తాళం ఇక్కడ!

ఇక్కడే అసలు ట్విస్ట్ చోటుచేసుకుంది. నవాబ్ పాషా సూపర్‌బజార్‌లోని నాగలింగం ఆస్పత్రిలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. అదే వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఆయన పనిచేస్తున్న ఆస్పత్రిపై అధికారులు చర్యలు తీసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆస్పత్రికి, దానికి సంబంధించిన మెడికల్ షాపునకు ట్రేడ్ లైసెన్స్ లేదనే కారణంతో అధికారులు తాళం వేశారు.

### నోటీసు ఎక్కడ..

లైసెన్స్ లేకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంలో అభ్యంతరం లేదు. కానీ సంబంధిత సంస్థకు ముందుగా నోటీసు ఇచ్చారా.. వివరణ కోరారా... నిబంధనల ప్రకారం సమయం ఇచ్చారా..అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. నోటీసు లేకుండా తాళం వేశారా.. నిబంధనల ప్రకారం వ్యవహరించారా.. అన్నది అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది.

### చర్యా.. కక్ష సాధింపా..

ఒకవైపు అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు. మరోవైపు ఫిర్యాదు చేసిన వ్యక్తి పనిచేస్తున్న ఆస్పత్రిపై మున్సిపల్ చర్య. ఈ రెండు పరిణామాలు ఒకదాని వెంట ఒకటి చోటుచేసుకోవడంతో పట్టణంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది కేవలం యాదృచ్ఛికంగా జరిగిన చర్యేనా..లేక ఫిర్యాదుకు వచ్చిన ప్రతిచర్యా.. అనే చర్చ జరుగుతోంది.

### ప్రశ్నించే గొంతును... తాళంతో మూయగలరా..

ప్రజాస్వామ్యంలో అధికారులను ప్రశ్నించడం తప్పు కాదు. తప్పు జరిగిందని భావిస్తే ఫిర్యాదు చేయడం పౌరుడి హక్కు. ఫిర్యాదులో వాస్తవం ఉంటే చర్య తీసుకోవాలి. వాస్తవం లేకపోతే తిరస్కరించాలి. కానీ ‘నువ్వెవరు’ అంటూ ప్రశ్నించే వ్యక్తినే నిలదీయడం, ఆ తర్వాత అతను పనిచేస్తున్న సంస్థపై చర్యలు చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

### ఇది జస్ట్ ట్రైలర్... సినిమా ముందుంది...

ఇది కేవలం సినిమా ముందు వచ్చే ట్రైలర్ మాత్రమే... మిగతా సినిమా ముందుంది అంటూ కమిషనర్ నవాబ్ పాషా కు వార్నింగ్ ఇవ్వడం కొసమెరుపు.. . ఫిర్యాదు చేసిన ఫిర్యాదు దారుడు పై ఇలాంటి చర్యలు మానుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ఉన్నతాధికారులు స్పందించాలి

**- నవాజ్ పాషా, మామిండ్ల వాడ,**

మామిండ్ల వాడలోని ఓ అక్రమ నిర్మాణం పై ప్రశ్నించినందుకు ఆసుపత్రికి తాళం వేశారు. నీకు ఏం హక్కు ఉందంటూ నాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలి

- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే... ఫిర్యాదుదారుడిపైనే ఆగ్రహం!
- ‘నువ్వెవరు..?’ ‘ఏ అధికారంతో ప్రశ్నిస్తున్నావు..?’ అంటూ కమిషనర్ మండిపాటు
- పట్టణంలో హాట్‌టాపిక్!





## ఎలిగేడులో ఘనంగా పోషణ మాస వారోత్సవాలు

**ఎలిగేడు, సెప్టెంబర్ 5 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ సూపర్వైజర్ అనిత మాట్లాడుతూ.. పిల్ల ఎదుగుదలలో పౌష్టికాహారం, సమతుల్య ఆహారం, ఆకుకూరలు, పండ్ల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా గర్భధారణ నుంచి బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు (మొదటి 1000 రోజులు) తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, సూపర్వైజర్ అనిత, పంచాయతీ కార్యదర్శి అంజలి, వార్డు సభ్యులు కవ్వంపల్లి సృజన, శ్రీలత, శ్రీధర్, అంగన్వాడీ టీచర్లు సరోజ, జ్యోతి, సరస్వతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



## ధర్మారంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'ఆంగన్ మిలన్'

**కోనరావుపేట, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ధర్మారంలోని అంగన్వాడీ కేంద్రంలో బీజేపీ మండల మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'ఆంగన్ మిలన్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షురాలు తీగల జయశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో విశేష సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్కర్ బాలాజీ మాట్లాడుతూ.. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బైరగోని సురేష్, అజ్మీర వినోద్, పొన్నం లక్ష్మి, జాప లక్ష్మి, మైలారం వెంకటేష్, ఆసారి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి
- సుల్తానాబాద్‌లో ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన అబ్జర్వర్, కలెక్టర్
- అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశం




**సుల్తానాబాద్, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పద్మనాయక ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్‌ను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆమె పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌లో అందుతున్న సేవలు, దరఖాస్తుల స్వీకరణ, నోటీసుల పరిశీలనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫారం-6,7,8 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ నోటీసులు, సంబంధిత పత్రాలను పరిశీలించి పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, సుల్తానాబాద్ తహసీల్దార్ బషీరుద్దీన్, ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

## దసరా, బతుకమ్మ ఉత్సవాలకు సిద్ధమవుతున్న భీమేశ్వరాలయం

### విద్యుత్ వెలుగుల్లో ఆలయం.. ముమ్మరంగా ఏర్పాట్లు

**వేములవాడ, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం సద్దుల బతుకమ్మ, విజయదశమి (దసరా) పర్వదినాల నేపథ్యంలో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, సీరియల్ సెట్లతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి కోసం ప్రత్యేక పూజా మండపాన్ని సిద్ధం చేస్తున్నారు. మహిళా భక్తులు బతుకమ్మ ఆడటానికి, కోలాటం నిర్వహించేందుకు వీలుగా భీమేశ్వర సదన్ వద్ద ఉన్న విశాలమైన పార్కింగ్ ప్రదేశాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. అక్కడ విద్యుత్ వెలుగులతో పాటు సకల సౌకర్యాలు కల్పిస్తూ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో రమాదేవి ఆదేశాల మేరకు ఈఈ రాజేష్ క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.





# ఎస్.జి.ఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలకు పారమిత విద్యార్థులు ఎంపిక

**కరీంనగర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. ఇటీవల పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలలో 7వ తరగతి విద్యార్థి సి.హెచ్. అన్విక్ష్ నందన్ (అండర్-14), 10వ తరగతి విద్యార్థి బి. సుకీర్త్ (అండర్-17) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. విజేతలను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, కె. హన్మంతరావు, హెచ్ఎం గోపీకృష్ణ, పిఈటీలు ఎస్. రాజు, ఎం. సాగర్ అభినందించారు.



# కాకా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- జి.వెంకటస్వామి జయంతి సందర్భంగా సుల్తానాబాద్‌లో అన్నదాన కార్యక్రమాలు
- వృద్ధులు, మానసిక వికలాంగులకు భోజన పొట్లాల పంపిణీ



**సుల్తానాబాద్, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** మాజీ కేంద్రమంత్రి స్వర్గీయ కాకా గడ్డం వెంకటస్వామి 97వ జయంతిని పురస్కరించుకుని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నీరటి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం సుల్తానాబాద్‌లో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బిర్యానీ భోజన పొట్లాలను పంపిణీ చేయడంతో పాటు మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నీరటి శంకర్ మాట్లాడుతూ.. కాకా వెంకటస్వామి కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, ఎంపీగా కార్మికులు, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కాకా రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆయన కుమారుడు వివేక్ వెంకటస్వామి, మనవడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లం లక్ష్మణ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి అరేపల్లి రాహుల్, నాయకులు న్యాతరి శ్రీనివాస్, కనుకుంట్ల శ్రీనివాస్, ధరాడే శ్యామ్, జొన్నాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

## రైస్ మిల్లు లారీ డ్రైవర్ల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



**సుల్తానాబాద్, అక్టోబరు 5 (ప్రజా జ్యోతి):** రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న లారీ డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాండ్ర అంజయ్య పిలుపునిచ్చారు. పూసాల పెద్దమ్మ గుడి వద్ద సోమవారం రైస్ మిల్లు లారీ డ్రైవర్ల యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 6 ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో పాటు వారాంతపు, పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తాండ్ర అంజయ్య, అధ్యక్షుడిగా పోగుల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా జంగా తిరుపతిరెడ్డి, మండల కో-కన్వీనర్‌గా మాతంగి రాజమల్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మంజూరు అహ్మద్‌బేగ్, కాసర్ల మహేందర్‌రెడ్డి, రబ్బాని, మజహర్, మునీర్, ఆసంపల్లి శంకర్, మాతంగి శంకర్, దాసరి సంతోష్, వాజీద్ అలీ, కొల్లూరి అంజయ్య, నజీర్, మల్లేష్, సారయ్య, ఇమ్రాన్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలువురు లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల కాలనీకి మౌలిక వసతులు కల్పిస్తాం: విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** వేములవాడలో నూతనంగా ఏర్పడుతున్న జర్నలిస్టుల కాలనీకి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన జర్నలిస్టుల నివాస గృహాల సముదాయాన్ని సందర్శించి, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న నేపథ్యంలో కాలనీలో తాగునీరు, విద్యుత్, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు



తెలిపారు. నీటి ఎద్దడి తలెత్తకుండా 3 బోర్ బావులు తవ్వించి మోటార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్ణయంతో ఇందిరమ్మ ఇళ్లు, రైతులకు ఉచితంగా విద్యుత్ లైన్లు వేసే విధానం అమల్లోకి వచ్చిందని, దీనిద్వారా ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే 2,800 స్తంభాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ఫోర్త్ ఎస్టేట్‌గా కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సహకరించాలని కోరారు. కాలనీ వాతావరణం ఆహ్లాదకరంగా మారేందుకు ఇక్కడ వనమహోత్సవం నిర్వహించి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.



## మృతిచెందిన హరీష్ కుటుంబానికి శ్రీకృష్ణ యూత్ ఆర్థిక చేయూత

**ధర్మారం, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ధర్మారం పట్టణానికి చెందిన నూనె హరీష్ కుటుంబానికి శ్రీకృష్ణ యూత్ సభ్యులు అండగా నిలిచారు. సోమవారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.70,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వీరితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల ప్రదీప్ రెడ్డి రూ.5,000, ప్రవీణ్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ దాగేటి ఉదయ్ యాదవ్ రూ.5,000 ఆర్థిక సాయం అందించగా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈదుల శ్రీనివాస్ యాదవ్ 25 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. హరీష్ కుటుంబానికి అండగా నిలిచిన దాతలకు శ్రీకృష్ణ యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి తగిన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు

**ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పదిర గ్రామం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్. రమేష్



తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఇసుక తరలిస్తున్న నాగంపేటకు చెందిన డ్రైవర్ ఉరడి రామచంద్రంను పట్టుకుని విచారించగా.. ట్రాక్టర్ యజమాని వట్టెల రవి ఆదేశాల మేరకే ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్సై పేర్కొన్నారు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రైవర్, యజమాని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## రామడుగులో దొంగల బీభత్సం

### ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి చోరీ

**రామడుగు, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన ఘటన రామడుగు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక ఎండీ ఉస్మాన్ ఖాన్ కుటుంబ సభ్యులతో కలిసి కరీంనగర్‌లోని ఓ కార్యక్రమానికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చి చూడగా తలుపులు తెరిచి చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల సమాచారంతో ఎస్సై రాజు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. దొంగలు 2.5 తులాల బంగారం, 36 తులాల వెండి, నగదును ఎత్తుకెళ్లినట్లు తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

- 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి
- రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- విస్తరణ పనులు పూర్తి చేసే అవకాశం అదృష్టం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్






**వేములవాడ, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వీటీఏడీఏ (యాడా) ఆధ్వర్యంలో చేపడుతున్న శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణం, బద్ది పోచమ్మ ఆలయం తదితర నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సోమవారం వివరించారు. దీనిపై రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### భవిష్యత్తు రద్దీకి అనుగుణంగా ప్రణాళికలు

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని సూచించారు. ప్రస్తుత భక్తుల రద్దీతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఒక్కో పనికి గడువు విధిస్తూ వాటిని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని వెల్లడించారు. 80 ఫీట్ల రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

### భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా నిర్మాణాలు

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు పూర్తి చేసే అవకాశం రావడం అదృష్టమని, అధికారులు పూర్తిస్థాయిలో భాగస్వాములై పనులను వేగవంతం చేయాలని సూచించారు. శ్రీ విధుశేఖర భారతి స్వామి, సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు భక్తుల నమ్మకాలు, విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ విస్తరణ పనులను చేపట్టాలని స్పష్టం చేశారు.

### క్షేత్రస్థాయిలో నిరంతర పరిశీలన

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను ప్రతి వారం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.
ఈ సమీక్షా సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఈఈ భీమ్లానాయక్, ఆలయ ఈఓ రమాదేవి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఎం శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీటీఏడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# పరిమితికి మించి విద్యార్థుల తరలింపు..

- స్కూల్ బస్సుల్లో భద్రత ప్రశ్నార్థకం
- సామర్థ్యానికి మించి పిల్లల రవాణా
- తల్లిదండ్రుల తీవ్ర ఆందోళన వ్యక్తం
- అధికారుల తనిఖీలకు స్థానికుల డిమాండ్




**ముస్తాబాద్, అక్టోబర్ 05 (ప్రజాజ్యోతి):**
ముస్తాబాద్ మండలంలోని కొన్ని ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సుల్లో బస్సు సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారనే ఆరోపణలు విపరీతంగా వినిపిస్తున్నాయి. ఉదయం పాఠశాలలకు, సాయంత్రం ఇళ్లకు విద్యార్థులను తరలించే సమయంలో పరిమితికి మించి పిల్లలను బస్సుల్లో ఎక్కించుకుంటున్నారని, కొన్ని సందర్భాల్లో నిల్చునే పరిస్థితి కూడా ఉంటోందని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**చిన్నారుల భద్రతే ప్రధాన ప్రశ్న**

స్కూల్ బస్సుల్లో ప్రయాణించేవారంతా చిన్నారులే కావడంతో వారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని స్థానికులు చెబుతున్నారు. బస్సులో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉంటే సీటింగ్, ప్రయాణానికి అవసరమైన స్థలం, సురక్షితంగా ఎక్కడం--దిగడం వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థులను త్వరగా బయటకు తీసుకురావడంలోనూ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రవాణా రుసుములు వసూలు చేస్తున్నా నిర్లక్ష్యం**

ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి పాఠశాల ఫీజులతో పాటు రవాణా రుసుములు కూడా భారీగా వసూలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాలపై ఉందని తల్లిదండ్రులు గుర్తుచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగినన్ని వాహనాలను ఏర్పాటు చేయకుండా, ఒకే బస్సులో అధిక సంఖ్యలో పిల్లలను తరలించవద్దని వారు స్పష్టం చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు తక్షణమే చేపట్టాలి**

ముస్తాబాద్ మండలంలో నడుస్తున్న స్కూల్ బస్సులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. బస్సుల సామర్థ్యం, ఫిట్‌నెస్, డ్రైవర్ అర్హత, భద్రతా పరికరాలు, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను అధికారులు తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే, విద్యార్థుల రాకపోకలు అధికంగా ఉండే సమయాల్లో తనిఖీలు నిర్వహిస్తే నిబంధనల ఉల్లంఘనలను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

**ప్రమాదం జరిగే వరకు వేచి చూడొద్దు**

స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నట్లు తేలితే సంబంధిత పాఠశాల యాజమాన్యాలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే తనిఖీలు నిర్వహించి విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడిచే వాహనాలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి

**ఎంపీడీవో సురేందర్ కుమార్**

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో సురేందర్ కుమార్ అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కాల్వ శ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలపై నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. అందిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మీర్జంపేట్‌లో ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

**కాల్వ శ్రీరాంపూర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** మండలంలోని మీర్జంపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి భారీ స్పందన లభించింది. శిబిరంలో పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తమ విజ్ఞప్తి మేరకు గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్య బృందానికి సర్పంచ్ పోచాల శైలజ సదానందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి కిరణ్, ఎండి షరీఫ్, వైద్య సిబ్బంది అంజలి, స్నేహిత తదితరులు పాల్గొన్నారు.

## నరసింహస్వామి హుండీ ఆదాయం రూ. 4.72 లక్షలు

**బీర్‌పూర్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో లెక్కించారు. హుండీల ద్వారా స్వామివారికి మొత్తం రూ. 4,72,507 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యనిర్వాహణాధికారి (ఈవో) డి. కిరణ్, దేవాదాయ శాఖ జగిత్యాల ఇన్స్పెక్టర్ ఎం. రాజమొగిలి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ చీర్నెని శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనగంటి జితేందర్, ఆలయ అర్చకులు, సిబ్బందితో పాటు తుంగూరు సంతోషి మాత సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

**మహిళా సంఘాలకు రూ.6.94 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కు పంపిణీ**



**సుల్తానాబాద్, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం సుల్తానాబాద్‌లోని యశోద నరహరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడంతో పాటు రూ.6.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, ఇందిరమ్మ బస్సులు, క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, ఇటీవల భూపతిపూర్‌లో చైతన్య పెట్రోల్ పంపును ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కమిషనర్ రమేష్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్‌విండో చైర్మన్ చిలక సతీష్, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐఐటీ మద్రాస్‌లో సీటు సాధించిన గాయత్రి కళాశాల విద్యార్థిని

- **బీఎస్సీ డేటా సైన్స్‌లో ప్రవేశం పొందిన కోలేటి కనిష్క**
- **విద్యార్థిని, అధ్యాపక బృందాన్ని అభినందించిన చైర్మన్ అల్లంకి శ్రీనివాస్**




**పెద్దపల్లి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ పూర్తి చేసిన విద్యార్థిని కోలేటి కనిష్క ఐఐటీ మద్రాస్ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి 'బీఎస్సీ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్' కోర్సులో సీటు సాధించింది. ప్రతిష్టాత్మక ఐఐటీలో సీటు సాధించడం పట్ల గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థిని కనిష్క మాట్లాడుతూ.. కళాశాల అధ్యాపక బృందం అందించిన ప్రత్యేక శ్రద్ధ, నాణ్యమైన విద్యాబోధన, నిరంతర మార్గదర్శకత్వమే తన విజయానికి కారణమని పేర్కొంటూ గురువులకు కృతజ్ఞతలు తెలిపింది. కనిష్కను గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ ఘనంగా అభినందించారు. విద్యార్థినిని తీర్చిదిద్దిన అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందిస్తూ కనిష్క భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు

**నాంపల్లి, శాల రామన్నపల్లిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం**

**వేములవాడ, అక్టోబర్ 5 (ప్రజా జ్యోతి):** వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లి, శాల రామన్నపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల నివారణకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. నాంపల్లిలో 100 కేవీ, శాల రామన్నపల్లిలో 63 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో ఓవర్ లోడ్, తరచూ ఏర్పడే విద్యుత్ అంతరాయాల సమస్యలు తొలిగి గృహ, వ్యవసాయ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందుతుందన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లోని విద్యుత్ సమస్యలను తన దృష్టికి తీసుకెళ్తే అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



# ఎస్‌జీఎఫ్ పోటీల్లో శ్రీ ఆదర్శ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

- కరాటే, థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దాడి రఘువరన్, నెరెళ్ల శివమణి, మేక కారుణ్య




**పెద్దపల్లి, అక్టోబర్ 5 (ప్రజాజ్యోతి):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నందన గార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లిలోని శ్రీ ఆదర్శ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలుర విభాగంలో దాడి రఘువరన్ (-20 కేజీలు), నెరెళ్ల శివమణి (-60 కేజీలు) ఉత్తమ ప్రదర్శనతో విజయం సాధించారు. అదేవిధంగా సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో మేక కారుణ్య (-41 కేజీలు) విజయం సాధించింది. జిల్లా స్థాయిలో సత్తా చాటిన ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి మార్షల్ ఆర్ట్స్ కోచ్ మాస్టర్ కర్ర వెంకటేష్‌ను శ్రీ ఆదర్శ స్కూల్ కరస్పాండెంట్ చిప్ప భాస్కర్, ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీ రమ్యశ్రీ ఘనంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయకేతనం ఎగురవేసి పాఠశాలకు, పెద్దపల్లి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# కనగర్తి పాఠశాలలకు డీప్ రూట్స్ ఫౌండేషన్ విరాళం




